# శిలాప్రతిమ

Happy Youths' League
Publication

శ్రీరామా ప్రెస్, కాకినాడ.

# శిలాప్రతిమ.

# భావుక యువజన సమితి.

కార్యనిర్వాహక వర్గము:—

భావన్నారాయణస్వామి,
వెంకటరామశాస్త్రి,
రాఘవాచార్యులు,
సుబ్బారావు,
సోమసుందర్,
వీరభద్రిరావు,
నరసింహాచార్యులు.

స్వభాను మాఘము.

శ్రీరామాప్రెస్, కాకినాడ.

# శిలాప్రతిమ.

( ఏకాంక నాటిక )

దర్భా వెంకట రామశాస్త్రి.

భావుక యువజన సమితి.

కాకినాడ.

# —: ఆదర్శాలు :—

వివిధ ప్రాయల సంగమకారణమే కళ, కళారాధకులు, ప్రస్తుతాంధ్రావని గర్భకుహరమ్ములో పెక్కండ్రు. అట్టి ప్రభావ సంపన్నులలో అత్యధికులు పేటికాంతర్గత రత్నము వోలె ప్రకాశ విహీనులగుచున్నారు.

మహత్తరశక్తి సంపన్నులైన కళోపాసక సారస్వతాభిలాషుల కొకానొక యపూర్వావకాశము నొసంగి తద్దీప్తి వెదజల్లజేయుట మా ప్రధాన ఆదర్శము.

నిర్దుష్టమైన కళలతోడి సారస్వత సన్నివేశము గూర్చుటయే మా విధి.

ఇది మా తొలి పుష్పము. ఇందలి గుణాగుణములు జ్ఞానుల కంకితము.

# కానుక

## ఆవంచ సోమసుందర్

## బావకు

ఆనాఁడా కవికూటమున్ గలపి నీహాస్యమ్ము సేయంగ. నీ
వో నాకైతను నాచమత్కృతిని, భావోద్రేకతన్ గాంచి ది
వ్యానందమ్మున డాయఁజేరి ననుయాత్మారామమున్ జేర్చి "వి
న్నాన" న్నావెకదా! సఖా! భళిభళీ! నాపూర్వపుణ్యమ్ముచేన్.

కవివి వచోనుభావగుణశాదివి; ఆత్మపు నీవునాకు; నీ
జవనపు నాల్గునైదుల వసంతములందిన నేఁటి చిహ్నగా
కవనపు పెంటివైన నిను కాంచిన నాఁటి యశస్సు చిహ్నగా
కవనకళాప్రవీణుడను కావ్యమునల్లితి నంకితమ్ముగాన్.

పూవులు తావులన్ విసరుపోలిక భావము జల్లి ధారగా
జీవరసమ్ముఁ జేసితిని, చెల్మినిఁ బాడితి శైలిశయ్యకున్
తావునొసంగి, మైమఱచి, తావక ప్రేమసుధారసమ్ముదో
ఈవికి నా "శిలాప్రతిమ" నిచ్చుచు కానుక సోమసుందరా!

# ఆ ధా రా లు.



అంగజు కేళిని దమినీ
సంగతిఁ గాంక్షించినాఁడఁ జరితార్థునిఁగా
నంగన సఖుపుమయని బహు
భంగులఁ బ్రార్థింప నత్తపస్విని మదిలోన్.

౯౭౯

* * *

ముని వేషధరుఁడు శక్రుం
డని యెఱిఁగియు నిర్జరేంద్రుఁడను తలపున నీ
కౌనియెన్ దుర్మతియై యా
తనితోఁ గలియుంగ మఱిముదంబున బలికెన్.

౯౮౦

[ ఆంధ్రవాల్మీకి రామాయణం ]

# శిలా ప్రతిమ.

## దృశ్యము 1.

[మునిపల్లెలో నొక పటకుటీరము, పెరటిలో నొక తులసి కోట, అహల్య చేమోడ్చి నమస్కరించుచు]

అహల్య:- ఆరాధనకై మాలికలున్న
ఆరాధితుఁడేడీ? ప్రియా.... ॥ఆ॥
ఘుమఘుమలాడే— సుమసౌరభమే
భ్రమరాశ్వాసితమయ్యేన్? దేవీ! ఏ ॥ఆ॥
ఈ సుమమధుగోళిలా— యేతేటికినైనా
తీరికలేదా— రాదాబోవఁగ ॥ఆ॥
ఘుమఘుమలాడే — మొగలిపూవులీ
మొండితాఁచుకే — ముడివడెనా? ఆఁ ॥ఆ॥

గౌతముడు:- అహల్యా.... అహల్యా!

అహల్య:- ఆరాధనకై మాలికలున్న
ఆరాధితుఁడేలేడా?.... ప్రియా....

గౌ:- అహల్యా ! అహల్యా !

అ:- ఆఁ ఆ వస్తున్నా ! (సమీపించి) ఏమిశెలవు ?

గౌ:- సఖీ ! అహల్యా ! నీమధుర కంఠస్వరము ఎంత నిర్మ

లంగా స్రవించింది. మర మర శబ్దాలతో సుడులుతిరిగి, నదించే ప్రవాహాన్ని జ్ఞప్తికి తెచ్చింది. ఆఁ అహల్యా! మరినాకు.... శెలవు.... యిస్తావా?

అః- శెలవా? ప్రాణేశ్వరా! .... శెలవా?

గౌః- ఆఁ అవును. ప్రియసఖీ! నాకు శలవియ్యి.

అః- ప్రభూ! ఎక్కడికి ప్రయాణం? ఈ జటావల్కలాలు ఈ కమండలం, ఈ దర్భాసనం, ఈ లేడి చర్మం, మిమ్మల్ని ఎక్కడికి తీసుకెడుతున్నాయి ప్రభూ?

గౌః- తపస్సుకి. ఈ శిథిల వార్ధక్యంలో జీర్ణించిన నా కింత కంటె కావలసిన దేమిటి? తపస్సు చేస్తాను. తద్వారా మానవాతీతమైన అసాధారణ స్వర్గాన్ని సాధిస్తాను.... మరి శెలవు!

అః- ప్రభూ!

గౌః- హృదయేశ్వరీ!

అః- మీరు మోక్షాన్వేషణ చేస్తున్నారా! ఈపాదదాసిని ఏమని ఆజ్ఞాపిస్తారు ప్రభూ? తమ పాదసేవ చేసుకుంటూ, తమతో విచ్చేసి తరించ వలసిందనేకదూ! తమరు యిహలోక భోగాల్ని అరికట్టి మానవాతీతమైన అసా

ధారణ తపస్సు చేసుకుంటూ మోక్షాన్ని సాధించి మీ అర్ధాంగికి అందులో పాపాలు పరిసాదించరూ?

గౌ:- జవ్వనీ! స్వర్గసాధనకు తగిన శరీర క్షీణత- మానసిక దీక్ష- వైరాగ్యము- వార్ధిక్యము కావాలి- చూస్తే నీది నిండు యౌవ్వనం- చంచలచిత్తం- కామ్య శరీరం- నువ్వు చూస్తే చాలా పిన్నవయస్కవి. నీలో యౌవ్వన దశా లొక్కటొక్కటే దినదినమూ వికసిస్తున్నాయి. కామపరిమళాలు నీలో నలుగడలకూ వెదజల్లబడుతు న్నాయి- నీవెన్నెలజల్లే కన్నులలో ఏవో అర్ధంకాని ప్రణయ జ్యోతులు- యువక హృదయాల నువ్విళ్లూ రించే పరిణయ జ్యోతులు- వార్ధికాధిక్యల్ని హడలజేసే పరిశయ జ్యోతులు- దీపిస్తున్నాయి. చలించే నీలక్క రం?? పెదవులు సుమరసాన్ని వెదజల్లుతున్నాయి.

అ:- (విషాదంగా) అడవినికాచిని వెన్నెలలు వెలుగుకూడా అంతే.

గౌ:- అనింద్య సుందరీ! నా అసమర్ధతను నిందిస్తున్నావ్, బూడిదలో పోసిన పన్నీరులా వ్యర్ధమైన నీ యౌవ్వన సౌరుభాన్ని తలచుకొని కుమిలి కుమిలి కృశించు

చున్నావ్. కాని ఒక్కసంగతి.... సూర్యుడు తూర్పునే గాని పడమటను ఉదయించలేడు. అదంతా విధి. జరగవలసిందేదో జరిగిపోయింది. జరగనున్నది జరక్కమానదు. విధి విలాసాన్నిగూర్చి అనవసరంగా కన్నీరు కారిస్తే యేంలాభం ? అనవసరంగా హృదయ సంక్షోభను పెట్టుకొని కృశించకు. ఈ జన్మకు నీవింతే పెట్టి పుట్టేవ్. ప్రారబ్ధాన్ని అనుభవించక తీరుతుందా ? సంచితం చేతనైనా ఆ గామిని నశింపజేయి. ప్రేమపిపాసీ ! నాయందు నీకేమైనా భక్తిగౌరవాలుంటే నా నామరూపాల్ని నిత్యమూ మనస్సులో ధ్యానిస్తూ ఉండు. ఆదే పతివ్రతలకు పరమ పవిత్రత.... నెలవా ?

అ:- దాహతప్తుడై తపించే పాంధునకు ఎండమావులు దాహాన్ని తీర్చగలవా ప్రభూ ! పురుషహృదయం శిలామయం. ప్రేమకూ, వాత్సల్యానికీ, దయకూ, సానుభూతికీ, అందులో స్థానం లేదు. కాని, స్త్రీలహృదయం శిరీషకుసుమపేశలం; నవనీతం. ప్రేమకూ వాత్సల్యానికీ అది కఱగి ప్రవహిస్తుంది. ప్రవాసదుఃఖంలోనూ. సంయోగానందంలోనూ మీ మూర్తులే మమ్మల్ని

మైమఱపిస్తాయి. సర్పవక్త్రంలో వడి సగం తినబడ్డ మండూకం జిహ్వానుచాచి కీటకాల్ని వేటాడేలాగే, వార్ధక్యంలోపడి అవసానదశలోకూడా నవవికసితసుమసమ శరీరులమైన నారీమణులను వేటాడుట మానరు మీ పురుషులు, (నిట్టూర్చి) ప్రభూ !

గా:- లోకక్షేమాన్ని కోరే ఈవృద్ధతాపసిని తనకర్తవ్యాన్ని నెరవేర్చుకోపోనీ "యౌవనావా వనావా' అని యౌవన భాగ్యం లేకపోయినా వనభాగ్యాన్నైనా నన్ననుభవించనీ

అ:- (కోపంతో) అలాగా ? అయితే ! యీశిధిల వార్ధక్యంతో నా యీయౌవన నదీప్రవాహానికి ఎందుకు ఆనకట్ట కట్టేవ్ ? ఇలా నాకళ్ళల్లోకి చూడండి ! ఉప్పొంగిపోతూవున్న యౌవనం ! అసమానమై ఆకర్షించే ఈరూపలావణ్యాలు !.... యీ తీరని ప్రేమతృష్ణ !.... పద్మపత్రాలలోని నీటిబిందువులల్లా చలిస్తూవున్న నా అమాయక హృదయం మీ జ్ఞాననేత్రానికి గోచరించటం లేదూ ? చూసి చూసి, ఎండి శిశిరజీవనాన్ని అనుభవిస్తూవున్న నీ మోడుమ్రానుకి కొత్తగా పూచిన మాధవీలత నంటగట్టేవా ? (ఏడుస్తుంది)

గౌ:- అదిగో ఋషుల సమూహం వస్తోంది. సెలవ్.

అ:- గౌతముడు వెళ్ళాడు.... అదొక మోడు; ఇదొక లత; మోక్షాన్వేషణ ఆ హృదిది- ప్రేమాన్వేషణ ఈహృదయానిది; ఆహృదయంలో శాంతి, ఆఅధరంలో తృప్తి ప్రతిఫలిస్తున్నాయి- ఈ హృదయంలో ప్రేమ, ఈ అధరంలో తృష్ణ పొర్లి ప్రవహిస్తున్నాయి- ఆజీవితం వియోగాన్ని- ఈజీవితం సంయోగాన్ని కోరుతూంది. మా యిద్దరి జీవితాలు ఇలాగే పాయలుపడ్డ నదిలా వియోగాఘరివులలో నడించవలసిందే కాబోలు....

ఆరాధనకై మాలికలున్నా
ఆరాధితుడేడీ ! ప్రణయారాధీ.... ॥ఆ॥



దృశ్యము ౨.

[పూలతుప్పలు- నడుమ మఱ్ఱిచెట్టు- క్రింద నల్లరాయి-
దానిపై కూర్చొని]

అ:- ఓహో ఓహోహో ఓ బాటసారీ ! ॥ఓ॥
సుమహృదిలోనీ- సుమమధువిదియే
భ్రమరాన్వితపై - రారాగ్రోలగ ॥ఓ॥
చంద్రికకై కుందు- చకోరమా ! రా
పున్నెమవెన్నెల- కన్నులతాగ్రగ ॥ఓ॥

ఈ మధుమాసశోభ తన చంద్రికలవెల్ల అన్నిదిక్కులకూ వెదజల్లే ఈ అమూల్య సమయంలో ఆ స్వప్నంలోని మధుమూర్తియొక్క తీయని రూపమే గోచరిస్తోంది. ఈ నిర్మల గంగానదీ ప్రవాహంలో జనించే మర్మరధ్వనులలో ఈమామిడాకుల ఆలింగనచుంబన శబ్దాలు మేళవించి వీణానాదాన్ని మైమఱపిస్తున్నాయ్ ! ప్రకృతంతా ఈగంభీర నిశీధినిలో మైమఱచి తన్మయత్వాన్ని ఆస్వాదిస్తోంటే. నన్నుమాత్రం ఏదో మధుర స్వప్నంలోని సుందరవదన జ్యోత్స్న తిరిగి తిరిగి కలవర పెడుతోంది.

ఓసౌందర్యనిధీ ! ఆనాటి ఆమధుస్వప్నవీధిలో ప్రత్యక్షమై నన్ను చాలా కలవరపెట్టావ్ ! ఆనాడు వెన్నెలజల్లే

నీ నీలినేత్రాలలో ప్రేమజ్యోతి గోచరించింది.

[ ఇంద్రుడు ప్రవేశం. ]

నువ్వు తృప్తిలేని దృష్టితో, అతీతమైన దాహంతో తఱుచుకొని, తఱుచుకొని నా హృదయంలోకి చూశావ్. ఆ చూపుల పదునుకే కలతపొందిన నాయెద తన్మయత నందింది. ఆతన్మయతలో కుంచుకొనే నామధురకంఠాన్ని చించుకొని ఒక మధురనాదం "ఎవరోయి భిక్షుకా నీవు ? " అంది. "సుందరీ ! నేను నీ ప్రేమ భిక్షుకుణ్ణి ! " అన్నావు. ఎంత సాహసం ! చిఱునవ్వు చిలకరించావుకూడా- ఏదీ ! ఇంకొక్క మాఱు చిలుకరించు ?

ఇః- (ఋషిరూపంలో నవ్వుతూ) సుందరీ !

అః- (కంగారుతో లేచి) ఆఁ....

ఇః- తపస్వినీ ! ఈ నీశుష్క తపస్సుచే నీయౌవ్వన చంద్రికల ఆయెడారిలో నెందుకు ప్రవహింప జేస్తావ్ ?

అః- (నిట్టూర్చి) భిక్షుకా ! ఎవరునీవు ?

ఇః- నేనా ? నేనా సుందరీ ! నీప్రేమ భిక్షుకుణ్ణి.

అః- ఆఁ !

ఇః- ఓ సుహాసినీ ! ఎవరునీవు ?

అః- నేను సుహాసినిని. తపస్వినిని.

ఇః- మాయావీ ! అబద్ధమాడుతున్నావ్ ! నీవు నా అహల్యవు కావూ ?

అః- ఒకప్పుడు నేనావృద్ధగౌతముని భార్యను అహల్యని.

ఇః- .... ....

అః- ఓతేజస్వీ ! నీవెవరవు ?

ఇః- దేవేంద్రుడను. కాని ఇప్పుడు ప్రియాన్వేషిని.

అః- అనృతం ! అబద్ధం : అకర్ణితం ! శోచ్యం ! ఓ పురాణపాంథ ! నక్కకూ దేవలోకానికీ సామ్యమా ? ఆతేజస్సు- ఆఠీవి- ఆగౌరవము నీకా ? ఒక్క వృద్ధ జటావల్కధారికా ? సన్యాసికా ? కల్ల ! నిజం చెప్పు. నీవు పూర్వసురలోకవాసివికాదు.

ఇః- నిజంగా నేనొక ఋషిని గౌతముణ్ణి.

అః- గౌతముడివా ? ఆముసలి గౌతముడివా ? అబ్బే కాదు ! నిజంచెప్పు. ఆముసలి గౌతముడవేనా ?

ఇః- ఆఁ అవును ప్రేయసీ ! కానీ....

అ:- చాలు. వెళ్ళిపో ! ఈ ప్రేమపిపాసి పాదాలముందరనుంచి తక్షణం వెళ్ళిపో.

ఇ:- ప్రేయసీ ! ఆవృద్ధగౌతమునికీ, ఈతరుణ గౌతమునికీ చాలా అంతరంవుంది. అతడుకామద్వేషి- ఇతడు కామ వాంఛి; అతడో ప్రేయసీదూరుడు- ఇతడో విరహావిధు రుడు; అతడో కృద్ధ వృద్ధుడు- ఇతడో శుద్ధ బద్ధుడు; నీకరతలామలకమైన జుంటిపెరతేనెను జుర్రుకొంటావో లేక పారబోసుకొంటావో ?.... ప్రేమపిపాసీ! బాగుగా ఆలోచించు. నీఆలోచనపైనే నీ భావిభాగ్యరేఖ వెలగ టమోఆరటమో జరుగుతుంది.

అ:- (ఒక్కనిముషం ఆగి) హృదయేశ్వరా ! ఇది సూక్ష్మపరి ష్కారంలేని గంభీరసమస్య. రండి ! నా ఆశ్రమంలో సేదతీర్చుకోండి ! ఈఅభాగ్యను కాపాడండి !

ఇ:- ఉహుఁ. నేనురాను. నీమనోభావాలను విశదంగా విపులీ కరిస్తేనేగాని నేనురాను. నీ అభిప్రాయమేదో త్వరగా స్పష్టంగా తేల్చు. నేను పోవాలి, నేను పోతాను.

అ:- నన్ను క్షమించండి ! మీరలా వెళ్ళటాన్కి వల్లకాదు, నాతో నాఆశ్రమంలోకి విచ్చేసి నన్ను చరితార్థురాలను

చేయండి. మీ బాహుపాశాలతో నన్ను మనసారా బంధించండి. నేను మీదాసిని. మీరు నా ప్రాణేశ్వరులు. నినదించే నాతృష్ణకు సుడులుతిప్పండి. నదించే నాప్రేమకు ఆనకట్ట కట్టండి. రండి! నా అధరామృతాన్ని ఆస్వాదించండి. భూలోకమాధుర్యాన్ని చవిచూపుతాను మీకు. నాతొలి యౌవనానుభవంచేనైన అర్ధనిమీలతాలలో స్వర్గమాధుర్యాన్ని చవిచూడండి. పొంగే నాప్రేమ గీతాలకు- మీహృదయ విపంచికా మధురానురాగనిక్వాణంతో శృతికలుపండి. ఈనూతన దంపతుల్ని తప్పకుండా ప్రకృతిమాత చేయెత్తి దీవిస్తుంది. కోకిల పంచమస్వరంలో మంగళహారతి నిస్తుంది. రండి, మా ఆశ్రమంకి.

సుమహృదిలోని- సుమమధువిదియే
భ్రమరాన్వితమై -రారాగోరిలగ ॥సు॥



దృశ్యము 3.

[పూలవనంలో ఇంద్రుడు, అహల్య విహరిస్తున్నారు]

ఇః- ఆనందనందాన మిందేనెయోమందయాన ! ॥ఆ॥
అః- సుందార సుకుమార కుమారమార ! ॥సు॥
ఇః- కలకాల కులికేటి చిలుకాలకొలికీ- కలికీ ॥ఆ॥
అః- ఆనందనందాన మందాలి మందారమీవె ॥సు॥
ఇః- ఆఁ.... మందారమంటీన మాధానీవె ॥క॥
అః- సుందార సుకుమార కుమారమార ! ॥ఓసు॥
ఇః- అహాఁ.... అహాఁ
అః- కాదా మరీ ?
ఇః- నీవో
అః- నీవో
అ + ఇః- ఆమందారమంటీన సూధావిలాగే
ఆనందనందాన మందూన తేలిపోదాం ॥తే॥
అః- (పకపకా నవ్వుతూ) తేలిపోదాంకదూ ?
ఇః- చెలీ! ఈసుమసౌరభాలు మనలచూసీపక్కున నవ్వుతున్నాయి చూడు ! ఎంతగండుతుమ్మెదైనా నీముంగురుల ప్రతాపానికి తలలొగ్గవలసిందే. ప్రణయసుందరీ ! నీఅస్ఫుట ప్రణయ వీణావాణినుండి వచ్చే మణిత మాధుర్యానికి సిగ్గుపడ్డ కోకిల పంచమస్వరంకూడా మూగవోయింది.

కల్యాణీ! నీకన్నులు జల్లేవెన్నెలముందు సిగ్గుపడక పోతే ఆచందమామ తనచంద్రికల్ని తెలిమబ్బు తెరలో ఎందుకు దాచుకొంటాడు? నీయీయెర్రని పెదవులలో చిలుకాడు అమృతం ఆఅమృత భాండంలోకూడా లేదు సుమా! (చుంబించి) ఓమధుమూర్తీ! నీయాలింగనంలో

చిన్నారిఅలలపై పున్నమవెన్నెలల్
 పన్నొత్తి పకపకా పలికినటుల
నీలాలనింగిలో తేలు మబ్బులనీడ
 చల్లచల్లనిగాలి జల్లులటుల
చక్కగాపూచిన చామరసుపరాగ
 మంటిన తేలితేటయంచులటుల
మట్టికొమ్మల చాటుమాటుయొగ్గిన కట్టి
 చాయలో నెలవంక జాలులటుల

పూర్ణచంద్రునిబోలు ప్రఫుల్ల కుసుమ
ప్రియను చుంబించి మత్తిల్లు భృంగికటుల
మానసమ్మున యవ్యక్త మధురిమమ్ము
ముంచివైచెను ప్రేయసీ! మునిగిపోతి.

అః- (వికటంగా నవ్వి) పచ్చకామెల రోగికి ప్రపంచమంతా పచ్చగానే కనబడుతుందిట, ప్రేమాన్వేషులకు ప్రకృతి ప్రేమమయంకాదూ!

ఇః- అవును. పచ్చకామెల రోగికి పచ్చగాకనబడినట్లే ప్రేమాన్వేషికి ఈజగతంతా ప్రేమమయంగానే కనబడుతుంది. నీకు అలా కనబడటంలేదా? నీలోప్రేమలేదా?

అః- హృదయేశ్వరా! నీహృదయపూర్వకంగా నన్ను ప్రేమిస్తున్నావా?

ఇః- హాస్యమా! ప్రేయసీ! నాశరీరంలోని ప్రతిఅణువూ ప్రతి క్షణమూ "అహల్యా, అహల్యా" అంటోంది. (కాస్సేపాగి కంగారుతో) ఆఁ! అఁ! ఆఁ! ప్రేయసీ! ప్రేయసీ!

అః- ఏమి? ఏమి

ఇః- కాదు ఏమిలేదు. నామనస్సుఎక్కడికో ,ఎక్కడికోపోయి పాడుతలపులతెచ్చి నాహృదయ సంక్షోభానికి గురిఅయింది. పగటిస్వప్నాలు! నిర్మలంగా, నిశ్చలంగా వున్న నీలినీటి తామరకొలనట- మనమిద్దరం స్వైరవిహారంచేస్తూ జలక్రీడలకని నీటిలోదిగాముట-నీవు తామరతూఁడు

లబోలుపద్మహస్తాలతో నీటిని నాముఖంమీదకుజల్లేవుట-
ఊపిరితిరగక ఉక్కిరిబిక్కిరై కొట్టుకొంటూంటే....
నీవు కాలుజారి.... నీటిలోపడి....మరణించావుట !

అ:- ఓస్ ! అంతేనా ! దానికెందుకింత కంగారు ?

ఇ:- కాదు ప్రేయసీ! నీవియోగాన్ని తలచుకొన్నంత మాత్రం లోనే ఈ అమరేశ్వరుడి హృదయం రాయిపైబడి తుత్తునియలైనట్లయింది.

అ:- అమరేశ్వరుడవా ! పాతకీ ! తపోబలంచే యౌవనాన్ని సాధించిన గౌతముడవే అనుకొన్నాను, మాయావీ ! నీవు అమరేశ్వరుడవా ?

ఇ:- ప్రేయసీ !

అ:- ఛీ : మాయావి ! భ్రష్టుడా! కుబుద్ధీ! దూరంగానిలబడు

ఇ:- హృదయేశ్వరీ ! ఇంతవరకూ పున్నెమవెన్నెలను వెదజల్లిన నీకన్నులు పద్మపత్రాలల్లా ఎఱ్ఱవారి ప్రళయనృత్యాన్ని జేస్తున్నాయ్. నీవాడిచూపుల పదునులో ఆహుతి కానున్న నాయెద నాకేభారమైపోతోంది. (ఉద్రిక్తంగా) సఖీ ! సఖీ ! అహల్యా ! క్షమించు సఖీ (ప్రార్థిస్తోన్నట్లు) శాంతించు రా ! నాతోకూడారా ! గతాన్ని మఱ

చిపో! ఈనాలుగేళ్ళల్లాగే సుఖంగా ప్రేమతో మొగలి పూవును పెనవైచుకొనే గోధుమవన్నెత్రాచులా కాలాన్ని గడపుదాం! పూవునుండిరాలే తేనెచినుకల్లా, చిందే కన్నీటి కణాలతో, కలువపూనుండి జారే మంచుబిందువుల శైత్యాన్ని వహించి, నీకోపాగ్నిని చల్లార్చు. ఈదాసుడు తన మరణాంతమూ నీప్రేమ శృంఖలాల్లో బంధింపబడి, సాయంసమయంలో తామరపూవులో బంధింపబడి జుంటితేనెను జుర్రుకొనే తేటిలా ఆనందాన్నను భవిస్తాడు.... ఆ స్వర్గలోకంలోని నందనవనంలో, వెన్నెల వెదజల్లే చలువరాతి కట్టడంమీద అమర్చిన బంగారు ఉయ్యాలపై మల్లెపూలుజల్లి నిన్నుకూర్చుండజేసి స్వయాన ఊపితీరుతాను.

అః- ఇప్పటి కీఅవమానం చాలు. సిగ్గుమాలిన ఈకామాంధురాలను వేలెత్తి "భ్రష్టురాలైన గౌతమమహర్షి భార్య ఈపిశాచే" నని ఆదేవతలుకూడా చూపనక్కరలేదు. అస్తమించే సూర్యబింబంలా నాముఖం సిగ్గుచే నెఱ్ఱవార నక్కరలేదు.

ఇః- సుందరీ! ఇంకొక్కమారు నన్ను నీవెచ్చని కౌగిలిలో

నికి జేర్చుకోవు ? నాఅధరామృతాస్వాదనచేత నీచింతల నన్నింటినీ మఱచిపోవూ ! ప్రియతమా !

అ:- ఛీ ! బుద్ధిహీనుడా ! రాక్షసాధమా ! నాశీలాన్ని మంట గలపిన నీకు, ఇంకా మనశ్శాంతి కలుగలేదా ? నాభర్త యేగాని మహాతపశ్శాలి అయితే నీ యీతుచ్ఛశరీర మంతా వేయితూట్లు పడిపోదూ! ఫో! దుర్మార్గుడా! ఫో!

[నిష్క్రమణ]



## దృశ్యము ౪.

[మహారణ్యమధ్యమము- గౌతమముని యోగనిష్ఠలో నుం టాడు- పిచ్చిఅహల్య పరుగుతో ప్రవేశం]

అ:- (కంగారుగా) ప్రాణేశ్వరా! .... ప్రాణేశ్వరా! .... ప్రాణేశ్వరా! .... ప్రాణేశ్వరా!

గౌ:- "ఓ విషాదప్రపంచ యాత్రావిరాగీ! ఓ నిరాశాపథైక విషాదపాంథ!" ధ్యాననిమగ్ననై యుగయుగాలనుండి ప్రచండ యోగనిష్ఠలోనున్న నన్ను విఘ్నమొనర్చిన ఓపాపీ! నీవు "శిలాప్రతిమ" వై పోవుగాక!

అ:- అ౯. ఆ౯. ప్రాణేశ్వరా!....

గౌ:- (కన్నులతెఱచి) ఏమి, ఏమి? నా అహల్యయా! ఈ ప్రవాస దుఃఖాశ్రుమూర్తి నా అహల్యయేనా? యీ నిర్జీవ శిలాప్రతిమయేనా నా అహల్య? అహల్యా! అహల్యా! "ఓ విషాద ప్రపంచ యాత్రి విరాగీ! ఓ నిరాశాపథైక విషాదపాంథ! ఓ ప్రవాస దుఃఖాశ్రుపయోదమూర్తి!"

[తెర.]

---

మాకన్నివిధముల సాయమొనరించిన శ్రీ క. లక్ష్మీనారాయణ రావుకు మేము కృతజ్ఞులము.

**Happy Youths' Publication**

# "YOUTH"

*by*

*Swamy & Sastry*

*and*

*Illustrations by*

*R. C. Ley.*

త్వరలో:

"ప్రివేణి" "విద్యుల్లత"

"సుందరం" "మావాడు"

"సౌదామిని"

వెల: పావులా.